'ఎర్రన్న విద్యా సంకల్పం' ఫలితాలు విడుదల

శ్రీకాకుళం అర్బన్ : ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తన తండ్రి పేరిట ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎర్రన్న విద్యా సంకల్పం పోటీ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేశారు. గ్రూప్ 1, 2, పోలీస్, డిఎస్‌సి విభాగాలకు నిర్వహించిన పరీక్షలకు 4,500 మందికి పైగా హాజరయ్యారు. అందులో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియోజకవర్గానికి వంద మంది చొప్పున 700 మంది అర్హత సాధించారు. ప్రతి నియోజకవర్గంలో మహిళలకు 30 కేటాయించారు. అభ్యర్థి మెరిట్‌ని బట్టి 700 మందిని ఎంపిక చేశామని ఎంపీ తెలిపారు. అర్హులైన వారందరికీ అతి త్వరలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పర్యవేక్షణలో పుస్తక సాయం ఉంటుందని, ప్రతి నియోజకవర్గంలో మొదటి స్థానం సాధించిన వారికి రూ.పది వేలు ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు.

సిపిఎస్ రద్దే అంతిమ లక్ష్యం

- ఒపిఎస్ అమలు చేసే వరకు ఉద్యమం
- ఎమ్మెల్సీ పి.రఘువర్మ
- కలెక్టరేట్ వద్ద ప్రతిఘటన ధర్నా

ప్రతిఘటన ధర్నాలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు, సిపిఎస్ ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ విమర్శించారు. సిపిఎస్ రద్దు... జిపిఎస్ వద్దు... పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎస్ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద శనివారం ప్రతిఘటన ధర్నా చేపట్టారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.75 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌కు భరోసాగా ఉన్న ఒపిఎస్ విధానం కాకుండా సిపిఎస్ కంటే మోసమైన జిపిఎస్ విధానాన్ని అంగీకరించేది లేదన్నారు. సిపిఎస్ రద్దే అంతిమ లక్ష్యమన్నారు.

రద్దు చేస్తారా? గద్దె దిగుతారా?

సిపిఎస్ రద్దు చేస్తారా?, గద్దె దిగుతారా? అని సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం తప్ప ఇతర ప్రత్యామ్నాయాలకు అంగీకరించబోమన్నారు. పెన్షన్ భారాన్ని తగ్గించుకోవడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయుల డబ్బును పెట్టుబడిదారులకు అందుబాటులోకి తేవడానికి ప్రపంచబ్యాంకు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి సిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చిందని, అమలును రాష్ట్రాల ఇష్టానికి వదిలేసిన తర్వాత 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి సిపిఎస్‌ను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఉద్యోగుల భవిష్యత్‌ను షేర్ మార్కెట్‌లో కార్పొరేట్ సంస్థల్లో తాకట్టు పెట్టిందని విమర్శించారు. తాకట్టు వ్యవహారాన్ని ఆలస్యంగా తెలుసుకున్న సిపిఎస్ ఉద్యోగులు కొన్నేళ్లుగా అనేక పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వం గ్రాట్యుటీ, ఫ్యామిలీ పింఛన్ ను ఇచ్చిందన్నారు. ప్రతిపక్ష నేతగా సిపిఎస్ రద్దుకు హామీనిచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకొచ్చాక మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. జిపిఎస్ అంటూ కొత్త మోసానికి తెరలేపి ఉద్యోగులను మభ్యపెడుతోందన్నారు. పెన్షన్ భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని స్పష్టం చేశారు. పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి.బాలకృష్ణ, గురుగుబెల్లి భాస్కరరావు, టి.సూర్యారావు, రెడ్డి సూరిబాబు, బెందాళం శోభన్‌బాబు, కొత్తపల్లి ప్రకాష్, కె.భానుమూర్తి, ఎస్.కిషోర్ కుమార్, మజ్జి మదన్‌మోహన్, టెంక చలపతిరావు, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమలది అక్రమ లాకౌట్

- మంత్రి అప్పలరాజు చోద్యం చూస్తున్నారు
- జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాల్సిందే
- రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

జీడి పరిశ్రమల అక్రమ లాకౌట్‌ను జీడి రైతులు, కార్మికులు వ్యతిరేకించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు పిలుపునిచ్చారు. స్థానిక మెట్టూరు తుపాను రక్షిత భవనం వద్ద గునుపల్లి ఎంపిటిసి టి.రాజారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన జీడి రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. జీడి పరిశ్రమల యాజమాన్యాలు మోసపూరిత అక్రమ లాకౌట్లు ప్రకటించి జీడి రైతులు, కార్మికులను వంచించే ప్రణాళికలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. జీడిపిక్కలకు ధర నిర్ణయించకుండా గ్రామాల్లో కాటాలు వేసి నాలుగైదు మాసాలకు బదులుపై పిక్కలను అక్రమంగా తీసుకుపోతున్నారని చెప్పారు. దీనివల్ల రైతు మరింత మోసానికి గురై నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజు చోద్యం చూస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర నిర్ణయించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జీడి రైతుల సహకారంతో ప్రజా ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సదస్సులో మెట్టూరు ఎంపిటిసి కొండప్ప సురేఖ, మాజీ సర్పంచ్ జి.చలపతిరావు, బాతుపురం సర్పంచ్ ప్రతినిధి బత్తిని లక్ష్మీనారాయణ, మాజీ వైస్ ఎంపిపి దాసరి జె.జెరావు, గ్రామ సంఘాల సభ్యులు ఎస్.కృష్ణారావు, వి.సాంబమూర్తి, మెట్టూరు అభ్యుదయ సంఘ అధ్యక్షులు పి.వాసు, జీడి రైతుల సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, రైతు సంఘం మండల అధ్యక్షులు టి.భాస్కరరావు, పెద్దసంఖ్యలో మహిళలు, జీడి రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి వ్యవసాయమే వెన్నెముక

- 1094 మంది రైతులకు రూ.31.73 లక్షల బీమా పరిహారం
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

నమూనా చెక్కును అందజేస్తున్న స్పీకర్, మంత్రులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశాభివృద్ధికి వ్యవసాయమే వెన్నెముక అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక అంబేద్కర్ కళా వేదికలో శనివారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం దండగ అని చంద్రబాబు చెప్తే, అదే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుకు అండగా నిలిచిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కీ.శే రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు అన్నీ జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వమే రైతుల తరపున బీమా కట్టి ఈ-క్రాప్ చేసుకున్నాక పంట నష్టం వాటిల్లితే బీమా పరిహారాన్ని అందిస్తోందని చెప్పారు. రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వెంటనే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందిస్తోందన్నారు. ఈ-క్రాప్‌లో రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు విధానాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు.

రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ పాదయాత్రలో రైతుల కష్టనష్టాలను చూసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. అందులో భాగంగానే రైతుభరోసా కేంద్రాలు అని తెలిపారు. గతంలో విత్తనాల కోసం రోజుల తరబడి క్యూలో రైతులు ఉండేవారని, తొక్కిసలాట ఘటనల్లో గాయపడిన రైతులూ ఉన్నారని గుర్తుచేశారు. నేడు రైతుల వద్దకే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంట విక్రయం వరకు అన్నీ అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 1094 మంది రైతుల ఖాతాలో రూ.31.73 లక్షల బీమా ప్రీమియం చెల్లింపు, జిల్లాలో 390 ఎస్‌సి రైతులను గుర్తించి విత్తనాలు, ఇతర ఉపకరణాల నిమిత్తం ఒక్కో రైతుకి రూ.పది వేలు చొప్పున రూ.39 లక్షలు పిఎం అజయ్ పథకం కింద అందజేయనున్నట్లు తెలిపారు. రైతు ఖర్చు తగ్గించి అధిక ఆదాయం అందించాలనే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో మూడు లక్షల మంది రైతులు ఇకెవైసి చేసుకున్నారని, మిగిలిన రైతులు చేసుకోవాలన్నారు. అనంతరం స్పీకర్, మంత్రులు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కార్పొరేషన్ల చైర్మన్ అంధవరపు సూరిబాబు, చైర్‌పర్సన్లు బల్లాడ హేమమాలిని రెడ్డి, రాజాపు హైమావతి, జెడ్‌పిటిసి రుప్ప దివ్య తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న ఎసిబి అధికారులు

రవాణా చెక్‌పోస్టుపై ఎసిబి దాడి

- రూ.2.20 లక్షల నగదు స్వాధీనం
- ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కేంద్రమైన ఇచ్ఛాపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఎత్తివేసిన ఏడేళ్ల తర్వాత తొలిసారిగా రవాణా శాఖ తనిఖీ కేంద్రంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక దాడి చేశారు. ఎసిబి శ్రీకాకుళం డిఎస్‌పి రమణమూర్తి ఆధ్వర్యాన సిఐ భాస్కరరావు, సిబ్బంది శుక్రవారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి శనివారం సాయంత్రం వరకు ఈ కేంద్రంలో తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో రూ.2,20,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. బీరువాలో రూ.1.97 లక్షలు, అధికారుల జేబుల్లో రూ.23,800 గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకుని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గోపీకృష్ణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఉష, అప్పన్నను అరెస్టు చేసి విశాఖపట్నం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారికి రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి మాట్లాడుతూ అంతర్రాష్ట్ర ప్రయాణాలు చేసే వాహనదారుల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు దాడులు చేశామని చెప్పారు. తనిఖీల్లో అనధికారికంగా ఉన్న రూ.2,20,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎసిబి ఎస్‌ఐ చిన్నంనాయుడు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర ద్వారా తాజా చేపల విక్రయం

మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఫిష్ ఆంధ్ర ద్వారా తాజా చేపలను విక్రయిస్తున్నట్లు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. నగరంలోని కుశాలపురం పరిధిలో గల పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర హబ్‌ను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫిష్ ఆంధ్ర పథకం కింద 14 వేల అవుట్‌లెట్స్ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నాలుగు వేల అవుట్‌లెట్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి మహిళలు, యువతకు ఎంటర్‌ప్రెజర్స్‌గా తయారు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. మత్స్య సంపద గణనీయంగా పెరగడానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఫిష్ ఆంధ్ర నిర్వహణకు పెట్టుబడి సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్, ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి, మత్స్యకార సంఘ నాయకులు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఉషు' పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

10వ సబ్ జూనియర్, 9వ జూనియర్ ఉషు జిల్లాస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు నగరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు హారికా ప్రసాద్ మాట్లాడుతూ మంచి క్రీడాకారులుగా భవిష్యత్‌కు బంగారు బాటలు వేయవచ్చని చెప్పారు. శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించే శక్తి క్రీడాకారులకు మాత్రమే ఉంటుందన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు మాట్లాడుతూ అనుభవమున్న శిక్షకుల ద్వారానే క్రీడాకారులు మరింతగా రాణిస్తారని తెలిపారు. రిమ్స్ వైద్యులు శిరీష మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన తోటి క్రీడాకారులను గమనిస్తూ నిర్దేశిత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. ఉషు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొగిరి కృష్ణంనాయుడు, రెడ్డి శివకుమార్ మాట్లాడుతూ ఉషు అంటే యుద్ధ కళ అని తెలిపారు. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారు ఈనెల 15, 16 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉషు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు సభాధ్యక్షులుగా ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్ వ్యవహరించారు. అనంతరం విజేతలకు వైద్యులు కె.ఉమామహేశ్వరరావు, కె.సంజీవరావు చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ మెడల్స్‌ను బహుకరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సనపల నర్సింహులు, తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జగన్నాథం, వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'వంశధార' నీరు విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార కుడి, ఎడమ కాలువలకు హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వంశధార సర్కిల్ ఎస్ఇ డోల తిరుమలరావు మాట్లాడుతూ తొలి రోజు కుడి, ఎడమ కాలువలకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడిచిపెట్టామని తెలిపారు. నదిలో ప్రస్తుతం నాలుగు వేల క్యూసెక్కులకు పైగా నీటి ప్రవాహం ఉందన్నారు. బ్యారేజీలో నీటి నిల్వలను బట్టి క్రమేణా నీటిని కాలువల్లోకి వదులుతామని చెప్పారు. కార్యక్రమంలో హిరమండలం, నరసన్నపేట ఇఇలు ప్రదీప్, ఎం.వి రమణ, డిఇలు ఎం.వి సురేష్ కుమార్, బగ్గు సత్యనారాయణ, గొట్టాబ్యారేజీ ఎఇఇ ధనుంజయ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

49 కేజీల గంజాయి పట్టివేత

ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, టెక్కలి రూరల్

ఇచ్ఛాపురం, టెక్కలిలో 49 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇచ్ఛాపురంలో ఐదుగురిని, టెక్కలిలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. ఇచ్ఛాపురం సరిహద్దు కేంద్రం వద్ద మోడల్ స్కూల్ సమీపంలో గంజాయిని తరలిస్తుండగా శనివారం దాడి చేసి పట్టుకున్నట్లు కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని పురుషోత్తపురానికి చెందిన బుగ్గ సావిత్రి, చిన్న బెహరా, ధనపాన కృష్ణ, బుగ్గ చిరంజీవి, రెయ్య త్రినాథ్, ఒడిశాకు చెందిన ఒక వ్యక్తి ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి పురుషోత్తపురం నుంచి రిటైల్‌గా అమ్మకాలు చేస్తున్నారు. సిఐ ఈశ్వరచంద్ర ప్రసాద్, పట్టణ ఎస్ఐ గోవిందరావు సిబ్బందితో మాటు వేసి, గంజాయి తరలిస్తున్న సమయంలో దాడి చేసి, 27.710 కేజీల గంజాయి బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. పురుషోత్తపురానికి చెందిన నిందితులు ఐదుగురిని అరెస్టు చేయగా, ఒడిశాకు చెందిన వ్యక్తి పరారీలో ఉండడంతో పోలీసులు గాలిస్తున్నారు. నిందితుల నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దాడులు చేస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

టెక్కలిలో 22 కేజీల గంజాయి స్వాధీనం

ఒడిశా నుంచి టెక్కలికి గంజాయిని రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన సర్వసుద్ధి బాలాజీ (బాలు), టెక్కలిలోని ఆది ఆంధ్రావీధికి చెందిన చిత్త ఎర్రయ్య (పుష్పరాజ్)ను మెళియాపుట్టి రోడ్డులోని వంశధార కాలువ సమీపంలో పోలీసులు శనివారం పట్టుకున్నారు. వారి నుంచి 22 కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ, ఎర్రయ్య ఒడిశా నుంచి టెక్కలికి గంజాయి రవాణా చేసి, ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. బాలాజీపై హిరమండలం, బత్తిలి పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతంలో పలు దొంగతనం కేసులు నమోదయ్యాయి. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

ఇచ్ఛాపురం : గంజాయిని పరిశీలిస్తున్న డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి

టెక్కలి రూరల్ : స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం

ఆందోళనలో రైతులు... ఉత్సవాల్లో పాలకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 171.7 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 107.8 మి.మీ వర్షం పడింది. అత్యధిక మండలాలు తీవ్ర వర్షపాతం లోటుతో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 3.99 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా, పట్టుమని పది వేల ఎకరాల్లోనూ రైతులు విత్తనాలు వేయలేకపోయారు. జూన్‌లో అడపాదడపా వానలు కురిసినా వేసవిని తలపించే ఉష్ణోగ్రతలు, ఎండ వేడిమి ఉండడంతో విత్తనాలు వేసేందుకు రైతులు సాహసించలేదు. జూలై పైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ నెలలోనూ ఇప్పటివరకు పెద్దగా వర్షాలు పడకపోవడంతో, ఈ సంవత్సరం విత్తనాలు వేయగలమా? లేదా? అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. వర్షాలు లేకపోవడంతో రిజర్వాయర్లు, బ్యారేజీల్లో నీటి నిల్వలు పడిపోయాయి. జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న గొట్టాబ్యారేజీ సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, 0.60 టిఎంసిల నీరు ఉంది. రైతు దినోత్సవం సందర్భంగా పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వంశధార అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. నదిలో నాలుగు వేల క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో ఉండడంతో ఎడమ కాలువకు 300 క్యూసెక్కులు, కుడి కాలువకు 200 క్యూసెక్కులు వదిలారు. వంశధారలో ఈసారి పుష్కలంగా నీరున్నా, పూర్తిస్థాయిలో విడిచిపెట్టే పరిస్థితి కనిపించడం లేదు. కాలువ గట్లు బలహీనంగా ఉండడం ఇందుకు ప్రధాన కారణంగా ఉంది.

ఎడమ కాలువ ఆధునీకరణ పనుల కోసం 2014 నుంచి అధికారులు పంపుతున్న ప్రతిపాదనలకు దిక్కు లేకుండా పోయింది. తాత్కాలిక మరమ్మతులకూ డబ్బులు ఇవ్వలేదు. వంశధార నీటిని వదిలినా నిధులు మంజూరు చేయకపోవడంతో, గుర్రపు డెక్క తొలగించే పని జరగలేదు. షట్టర్ల అవినీతిపై కోర్టు కేసు కొలిక్కి రాకపోవడంతో, పాడైన షట్టర్లతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఎడమ కాలువ పరిధిలోని పలాస, వజ్రపుకొత్తూరు, కుడి కాలువ పరిధిలోని గార మండలాలోని శివారు భూములకు నీరందని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలిలో అనుమతి లేకుండా అక్రమంగా ఎత్తిపోతల పథకాలను నిర్మించడం వల్లే పలాస, వజ్రపుకొత్తూరు శివారు భూములకు సాగునీరందడం లేదంటూ పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు దుయ్యబట్టారు. ప్రభుత్వంలో నిర్ణయాత్మక స్థానంలో ఉండి సమస్యలకు పరిష్కారం చూపలేని మంత్రి, తమ అసమర్థతను ప్రతిపక్షంపై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లోనూ అదే సమస్య పునరావృతమయ్యే అవకాశాలు ఉండడంతో, రైతుల ఆగ్రహం నుంచి తప్పించుకోవడానికి ఆ రకమైన విమర్శలు చేశారంటూ అంతా అనుకుంటున్నారు.

ఉద్దానం ప్రాంతంలో జీడి రైతుల ఉద్యమం అంతకంతకూ ఊపందుకుంటోంది. పంటకు మద్దతు ధర విషయంలో రైతులు చాలా పట్టుదలగా పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో జీపుజాతా నిర్వహించడంతో పాటు ఈనెల 18న పలాసలో మహాధర్నా చేపట్టేందుకూ సిద్ధమవుతున్నారు. గతంలో 80 కేజీల బస్తా రూ.14 వేలు పలకగా, ఇప్పుడు అదే బస్తాకు రూ.8 వేలు ఇస్తాం, రూ.9 వేలు చెల్లిస్తామంటూ వ్యాపారులు దోపిడీకి తెర తీశారు. కొద్ది నెలలుగా ఇదే తంతు సాగుతోంది. దీంతో జీడి పిక్కలకు ధర విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, 80 కేజీల బస్తాకు రూ.16 వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాటం కొనసాగిస్తున్నారు. రైతుల ఆందోళనలు అంతకంతకూ ఉధృతం కావడంతో వ్యాపారులు కొత్త రకం ఎత్తుగడకు తెర తీశారు. పంటను ఎక్కువ కాలం నిల్వ చేసుకునే అవకాశం లేని రైతులు తమంతట తామే పంటను తక్కువ ధరకు అమ్ముకునేలా బంద్ మంత్రం వేశారు. రైతులు వెరవకుండా తమ ఆందోళనలను కొనసాగిస్తూనే ఉన్నారు.

మరోవైపు వ్యాపారులు ఆడుతున్న నాటకానికి జీడి పరిశ్రమల కార్మికులు పని లేకుండా అయిపోయారు. రైతులు ఎక్కువ ధర అడగడం వల్లే తాము పరిశ్రమలను మూసేశామనే విషయం జనంలోకి వెళ్లేలా వ్యవహరిస్తున్నారు. కార్మికులు, రైతులకు తగవు పెట్టి జీడి పిక్కలకు మద్దతు ధర ఎగ్గొట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. తన నియోజకవర్గంలోనే ఇంత జరుగుతున్నా మంత్రి అప్పలరాజు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జీడి రైతులకు న్యాయమైన మద్దతు ధర చెల్లించాలని మంత్రి ఆదేశిస్తే, ఏ యాజమాన్యం అమలు చేయకుండా ఉంటుంది?. బంద్‌తో కార్మికుల ఉపాధి దెబ్బతింటుదని, వద్దని వారిస్తే ఎవరు మూసేస్తారు? వంటి ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. మూలపేట పోర్టు నిర్మాణ వ్యవహారాలన్నీ తన భుజాన వేసుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో శంకుస్థాపన చేయించగలిగిన అమాత్యునికి ఈ చిన్న సమస్య పెద్ద లెక్క కాదు. పరిశ్రమల యజమానులు, రైతులతో చర్చలు జరిపి సమస్యను ఒక్క కొలిక్కి తెచ్చే అవకాశం ఉన్నా ఎందుకనో ఆ పనిచేయడం లేదు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది, వ్యవసాయం బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని రైతు దినోత్సవం రోజున ప్రసంగాలు చేసినా వారి సమస్యలు పరిష్కరించకుండా అది సాధ్యం కాదని పాలకులు గుర్తించాలి.

IN THE HONOURABLE COURT OF THE MACT CUM, IV ADDITIONAL DISTRICT JUDGE SC& ST COURT SRIKAKULAM.

M.V.O.P. 99/2022

Between:

Nelaturi Narasamma, ...Petitioner.

And,

Dirgasi Dali Raju & others ...Respondents.

To,

R-1. Dirgasi Dali Raju, S/o late Appala Swamy, aged 36yrs., Godagali by caste, R/o Godagali street,Bobbili Centre, Rajam town, Rajam (M), Srikakulam (Dt). Driver of Car bearing No. AP 39 EC 9991.

R-2. Rizwan Ahmad, S/o Afzal Ahmad, R/o Ahmad South Jail Road, Allipuram, Visakhapatnam Urban, Visakhapatnam (Dt). Owner of Car bearing No. AP 39 EC 9991.

That the above named Petitioners has filed the above M.V.O.P. for claiming compensation under M.V. Act, against you and 2 others and the same is posted to **10-07- 2023** for your appearance before the Honourable Court. Therefore you are hereby directed to appear before the Honourable Court on **10-07-2023 at 10-30 A.M.,** either in person or through an Advocate, failing which the matter will be decided as per Law in your absence.

REDDY. VIJAYA KUMAR
Advocate, Srikakulam,
Mobile: 8179618898.

రైతు బాంధవుడు వైఎస్

జిల్లావ్యాప్తంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి

ఆమదాలవలస : విగ్రహానికి పూలమాల వేస్తున్న స్పీకర్ సీతారాం

మెళియాపుట్టి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న వైసిపి నాయకులు

సంతబొమ్మాళి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న జగన్నాయకులు

ఆమదాలవలస : రైతు బాంధవుడు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైఎస్ఆర్ 74వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువన ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆద్యుడు వైఎస్ఆర్ అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుదీర్ఘ పాదయాత్రను చేసి ప్రజల కష్టాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. 108, 104 వంటి వాహనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజారోగ్యానికి భరోసా ఇచ్చిన నాయకుడని అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులకు బాసటగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, బొడ్డేపల్లి రమేష్ కుమార్, దుంపల శ్యామలరావు, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, మామిడి రమేష్‌కుమార్, దుంపల చిరంజీవి పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జయంతి సందర్భంగా బొడ్డేపల్లిపేటలోని తన కార్యాలయం నుంచి కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్ విగ్రహం వరకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ శివారులోని జొన్నవలస ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పళ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ, పేడాడ వైకుంఠరావు, సూర్యారావు, బెండి పాపారావు పాల్గొన్నారు.

బొడ్డేపల్లిపేటలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యాన రక్తదానం నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు చింతాడ రవికి దుశ్శాలువ కప్పి సన్మానించారు.

పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువ ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు కోట గోవిందరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కలివరం మాజీ సర్పంచ్ కోట వెంకట రామారావు, యువ నేత కోట జస్వంత్ పాల్గొన్నారు.

పలాస : పేదల పెన్నిధి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ సంత మైదానంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్ పాల్గొనారు.

కాశీబుగ్గ సంత మైదానంలో వైఎస్ఆర్ విగ్రహానికి కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబు చౌదరి, జుత్తు నీలకంఠం, అలాగే అల్లుకోలలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, సర్పంచ్ దువ్వాడ వామాక్షి, దువ్వాడ రవి కుమార్, వ్యవసాయశాఖ అధికారులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

జి.సిగడాం : మండలం గెడ్డకంచరాం పంచాయతీ గదపపేటలో వైఎస్ఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పూలమాలలు వేశారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, అధ్యక్షులు బూరాడ వెంకటరమణ పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలంలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఏపీఎం లలిత ఏవో దాన కర్ణుడు జడ్పిటిసి ఎండయ్య, బి ఉదయ్ పలువురు సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే రెడ్డి శాంతి గ్రూపు, తూరుకాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్ గ్రూపు వేర్వేరుగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పడల కృష్ణవేణి అధ్యక్షతన వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, పిఎసిఎస్ డైరెక్టర్ నూకరాజు, జి.ఆనందరావు, ఎం.తిరుపతిరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి కె.త్రినాథ్, మహర్తాపురం సర్పంచ్ నాస బాలకృష్ణ పాల్గొన్నారు. అలాగే గోగుల వరప్రసాదరావు నాయుడు అధ్యక్షతన శ్రీకాంత్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం 500 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మెట్టూరు సర్పంచ్ ప్రతినిధి మొజ్జాడ చక్రపాణి, గోగుల వరప్రసాదరావు, పి.లక్ష్మణరావు, పిన్నింటి రామారావు నాయుడు, జడ్డు రామకృష్ణ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు చంటి, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత, వైసిపి నాయకులు బమ్మిడి తులసిరావు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని గంగాధరపేట, కొమనాపల్లి గ్రామాల్లోని వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్, ఎంపిపి వాన గోపి, మండల అధ్యక్షులు కనుసు సీతారాం, పైడి విఠల్‌రావు, దామ మన్మథరావు, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షుడు పోగోటి రాజప్పలనాయుడు, అల్లాడ పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు పొన్నాన ముసలి నాయుడు పాల్గొన్నారు.

కవిటి: నెలవంకలో ఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బాగ వేణు, ఇరోతు యుగంధర్, మాస్త్రి చంద్రశేఖర్, ఇరోతు వీరస్వామి, కీలు పాపారావు, దుక్క డిల్లిరావురెడ్డి, శివంగి శాంతమూర్తి, నీలాపు సురేష్ రెడ్డి, శివంగి ఉమ్మాపతి, బిసాయి మేఘనాథం, కీలు తులసి, కోటిపల్లి శ్రీను పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని ఈదులవలస, పిన్నింటిపేట గ్రామాల్లోని వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఆర్.త్రినాథరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని నగరంపల్లిలో పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, గోవిందపురం సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు, దేవునల్తాడ సచివాలయంలో సర్పంచ్ వరదరాజులు, సైనూరు సచివాలయంలో సర్పంచ్ అట్టాడ గోపి, పాత టెక్కలిలో ఎంపిటిసి బాలక శ్రీను, అమాలపాడు రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, ఉద్దనం రామకృష్ణాపురంలో సర్పంచ్ చింత హెమరావు, ఉద్దానం గోపినాథపురంలో సర్పంచ్ కర్ని శ్రీను, పెద్దమురారి లో మాజీ సర్పంచ్ కలిశెట్టి గోపాల్, గౌరకల రామారావు వైఎస్ఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి : మండలంలోని బొప్పయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి, ఆక్కవరం సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి, అప్పలనాయుడు, నర్సింగపల్లి సర్పంచ్ రౌతు జయమోహన్, పాతనౌపడా సర్పంచ్ దల్లి సంధ్యారాణి, పరశురాంపురం సర్పంచ్ కె.కామేశ్వరరావులు వైఎస్ఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం : వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆస్పత్రిలోని రోగులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామరావు, మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, దేవరాజ్, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని మర్లపాడులో సర్పంచ్ దట్టి తనూజ ఆధ్వర్యాన వైఎస్ఆర్ విగ్రహానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, వైస్ ఎంపిపి ప్రతినిధి అర్.కూర్మారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని ఉమిలాడ రైతు భరోసా కేంద్రంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆర్.హెచ్.పురంలో సర్పంచ్‌లు జోగి రాములమ్మ, ఎన్ని మన్మథరావు, నరసాపురం ఆర్‌బికెలో సర్పంచ్‌లు దుక్క భూషణరెడ్డి, యర్నినాగుల సునీత, గోవిందపురం ఆర్‌బికెలో సర్పంచ్ రెయ్య రామిరెడ్డి, పాలతలగాంలో సర్పంచ్ నక్కిట్ల అప్పన్న, ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, లక్కివలసలో సర్పంచ్ శ్రీరంగం వీరాస్వామి, కొల్లిపాడు సర్పంచ్ ప్రతినిధి గొరుసు సవరయ్య, ఎంపిటిసి ప్రతినిధి బొంగు కొండయ్య, సంతబొమ్మాళిలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి, ఎంపిటిసి ప్రతినిధి దూబ వేణు, చిన్నతుంగాంలో సర్పంచ్ అంగ లక్ష్మి వైఎస్ఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు.

మెళియాపుట్టి : మండలంలోని చాపరలో వైఎస్ఆర్ చిత్రపటానికి తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం 500 మంది వృద్ధులకు దుస్తులుపంపిణీ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, ఎఎంసి మాజీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు బోసి రామారావు, పెద్దింటి చంద్రావు, జనపరెడ్డి కన్నబాబు, గణేష్ ప్రధాన్, సిద్ధిపాలెం గౌరేష్, ఎస్.రంగారావు, సంతోష్ మజ్జి, రవీంద్ర జన్నా, ఎంపిటిసిలు ఎస్.రవికుమార్ ఉర్లన రుషి, శ్రీరామ్ మిన్ని, నక్క వెంకటకరావు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని వైఎస్ఆర్ జయంతి సందర్భంగా వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు ఆధ్వర్యాన రక్తదానం శిబిరం నిర్వహించారు. 40 మంది యువకులు పాల్గొన్న రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, పెంకి చైతన్యకుమార్, వైసిపి నాయకులు పైడి శ్రీనివాసరావు, జరుగుళ్ల శంకరరావు, మండల అధ్యక్షులు వట్టి సత్యనారాయణ, ధర్మవరం సర్పంచ్ అల్లు కన్నబాబు, పుడువలస సర్పంచ్ జరుగుళ్ల కృష్ణ, మురపాక ఎంపిటిసి తేనెల సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పలాస : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి అప్పలరాజు

కొత్తూరు : అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కోటబొమ్మాళి: స్థానికంగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, గడ్డవలస నాగభూషణరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఆమదాలవలస : రోగికి పళ్లు పంపిణీ చేస్తున్న గాంధీ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి నరసన్నపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డాక్టర్ దానేటి శ్రీధర్, పొన్నాడ రుషి, రొక్కం సూర్యప్రకాష్, శ్రీనివాస్ పట్నాయక్ పాల్గొన్నారు. అలాగే సూర్యమహల్ కూడలి వద్ద అన్నదానం నిర్వహించారు.

సోంపేట: స్థానిక బస్టాండ్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, జెడ్‌పిటిసి తడక యశోద, ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, మల్ల వెంకటరమణ పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక అంబేద్కర్ కూడలిలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బి.సునీల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో అభివృద్ధి పనులు

రెవెన్యూ మంత్రి ధర్మాన

శిలాఫకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెంలో రూ.కోటి నిధులతో అభివృద్ధి చేపట్టనున్నట్లు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని కిల్లిపాలెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిల్లిపాలెం వరకు 40 అడుగుల రోడ్డు విస్తరణతో పాటు కాలువలను నిర్మిస్తామని అన్నారు. లోఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అనంతరం రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రం దివాళా తీస్తుందని, వెనుజులా, శ్రీలంక అవుతోందని టిడిపి నాయకులు గతంలో విమర్శించారని అన్నారు. ఇప్పుడు అవే పథకాలు కొనసాగిస్తామని చంద్రబాబు చెపుతున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, ఎఎంసి చైర్మన్ ముకళ్ల తాతబాబు పాల్గొన్నారు.

'పద్మావతి'లో లీడర్‌షిప్ స్కిల్స్‌పై సదస్సు

ప్రజాశక్తి- నరసన్నపేట

ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకున్నప్పుడే వారి వారి రంగాల్లో సమర్థవంతమైన నాయకులుగా ఎదుగుతారని వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మాకేనా సతీష్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఎంపోవరింగ్ ఎడ్యుకేషన్ అన్ లీడర్ విత్ ఇన్ అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుడు వ్యూహాత్మక ఆలోచనాపరుడై ఉండాలని, అదే వారి జీవితంలో విజయానికి కీలకం అవుతుందని అన్నారు. మార్పు అనివార్యమని, సమాజంలో వస్తున్న మార్పులు గమనించి మూస పద్ధతిలో కాకుండా విభిన్న రీతుల్లో బోధన చేయాలని సూచించారు. నూతన విద్యా విధానం వల్ల విద్యా రంగంలో వస్తున్న మార్పులు గమనించి విద్యార్థులను సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, విద్యార్థి భవన్ డైరెక్టర్ ఆరంగి గోవిందబాబు, వివిధ స్కూళ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సతీష్

విశ్రాంత హోంగార్డుకు సన్మానం

నందిగాం : నందిగాం పోలీస్ స్టేషన్‌లో లఖినాన కృష్ణమూర్తి హోంగార్డుగా సుదీర్ఘకాలం పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావులు శనివారం కృష్ణమూర్తికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి ఆర్.కూర్మారావు, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య, మడపాల సంజీవరావు, కణితి నారాయణమూర్తి, కవిటి ఎర్రన్న పాల్గొన్నారు.

విస్తృతంగా జగనన్న సురక్ష సర్వే

సంతబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ రాములమ్మ

నందిగాం: సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు బాధ్యతతో మెలిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేద లబ్ధిదారులందరికీ అందేలా చూడాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నౌగాం, రదజన, బొడ్డపాడు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో జగనన్న సురక్షపై శనివారం సమావేశం నిర్వహించారు. ధ్రువపత్రాల పంపిణీ విషయంలో లబ్ధిదారులను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శివప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, వైస్ ఎంపిపి ప్రతినిధి ఆర్.కూర్మారావు, సర్పంచ్‌లు పుష్ప, బొడ్డపాటి తిరుపతిరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మ ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను గుర్తించి వెంటనే జగనన్న సురక్ష పోర్టల్‌లో అధికారులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి జొన్న సవర రాజు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పుక్కళ్ల లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి గణపతి పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి విక్రాంపురం, నీలాపురం గ్రామాల్లో జగనన్న సురక్షపై సర్వే చేపట్టారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీనిచ్చారు.

స్పీకర్‌కు సమస్యల వెల్లువ

మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్న మహిళలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రహదారులు, కాలువలు వంటి చిన్న చిన్న సమస్యలనూ 15 ఏళ్లుగా పరిష్కరించకుండా, ఎటువంటి అభివృద్ధి లేకుండా నిర్వీర్యం చేశారని వాంబే కాలనీ మహిళలు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లారు. పురపాలక సంఘంలోని పదో వార్డు పరిధిలోని వాంబే, హడ్కో కాలనీల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రహదారులు, కాలువలు, విద్యుత్ దీపాలు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్పీకర్ ముందు వాపోయారు. రాత్రిపూట పాములు బెడదతో సంచరించలేకపోతున్నామని అన్నారు. పలుమార్లు అధికారులకు, నాయకులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆయన ముందు వాపోయారు. కమ్యూనిటీ హాళ్లు ఇప్పటికీ పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన వాటికలోకి వెళ్లాలంటే ముళ్లపొదలు, సరైన రహదారి లేకపోవడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు.

విద్యుత్ స్తంభాలూ విరిగి పాడై పోయి శిథిల స్థితికి చేరుకున్నాయని, వాటి స్థానంలో నూతన స్తంభాలను వేయాలని మొరపెట్టుకున్నారు. వీటిపై స్పందించిన స్పీకర్ అక్కడే ఉన్న అధికారులను పిలిచి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, అజంతా కుమారి, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల చిరంజీవి, మామిడి రమేష్‌కుమార్, సాధు చిరంజీవి పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- జలుమూరు

నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకోసమే గ్రామీణ ప్రాంతాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని అన్నారు. వీటిని గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 13 ప్రయివేటు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 386 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూకు హాజరు కాగా, 129 మంది వివిధ కంపెనీల్లో పనిచేసేందుకు ఉద్యోగులుగా ఎంపికయ్యారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖరరావు, యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి వాన గోపి, మండల అధ్యక్షులు కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు దామ మన్మథరావు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ఉద్యోగులపై కూన రవి తీరు మార్చుకోవాలి

సువ్వారి గాంధీ

ఆమదాలవలస : ప్రభుత్వ ఉద్యోగులపై టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ తీరు మార్చుకోవాలని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 25 ఏళ్లుగా నియోజకవర్గానికి శాసనసభ్యుడిగా తానే ఉంటానని ప్రగల్భాలు పలికారని, 2019లోనే ప్రజలు ఆయనకు చెక్ పెట్టారని అన్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహారశైలిని మార్చుకోవాలని హితవుపలికారు. పొందూరు మండలం ఎలక్ట్రికల్ ఎఇ దుర్గారావుతో ఫోన్‌లో మాట్లాడిన తీరు సరికాదని అన్నారు. ఉద్యోగులపై ఆయన వ్యవహరిస్తున్న పద్ధతి మంచిది కాదన్నారు. ఇప్పటికైనా రవికుమార్ తీరు మార్చుకోకుంటే ప్రజల్లో తిరిగే పరిస్థితి ఉండదన్నారు. ఇలా అయితే 2024 ఎన్నికల్లో కూడా ఓటమి తప్పదని హెచ్చరించారు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని అన్నారు.

పర్యావరణానికి అనుకూలమైన

మొక్కలు నాటాలి

సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పర్యావరణానికి అనుకూలమైన మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించాలని సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలో రావివలస పంచాయతీ సమీపంలో స్టోన్ ఫ్లస్ గ్రానైట్ క్వారీ ప్రజా అభిప్రాయ సేకరణ శనివారం చేపట్టారు. సందర్భంగా మాట్లాడుతూ రావివలస పంచాయతీ నుంచి టెక్కలి వెళ్లే వరకు రోడ్డు ఇరువైపులా రెండు వేల మొక్కలు నెల రోజుల్లోపు నాటాలని గ్రానైట్ క్వారీ యాజమాన్యానికి ఆదేశించారు. అలాగే ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఉండకూడదన్నారు. నష్టం కలిగిస్తే చర్యలకు వెనకాడబోమమని హెచ్చరించారు. గ్రానైట్ యాజమాని శ్రీనివాస్ ప్రస్తుతం చుట్ట పక్కల రైతులకు నష్టపరిహారం చెల్లిస్తున్నారని అన్నారు. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మింస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కాలుష్యం నియంత్రణ బోర్డు ఇఇ పద్మావతి, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

వ్యవస్థలన్నీ నాశనం

వజ్రపుకొత్తూరు : పోస్టర్లను పంపిణీ చేసిన గౌతు శిరీష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వైసిపి ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష ఆరోపించారు. మండలంలోని ధర్మపురంలో చంద్రబాబు భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహానాడు వేదికగా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఉమామహేశ్వరరావు, పొతనపల్లి సాంబమూర్తి, రెల్ల దానయ్య, చెల్లూరు రాజశేఖర్, రాపాక శాంతమూర్తి పాల్గొన్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

పలాస: టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు అభిమానులు ఇప్పటి నుంచే కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలకు అవగాహన కల్పించి రానున్న ఎన్నికల్లో టిడిపికు ఓట్లు వేసే విధంగా కృషి చేయాలని అన్నారు.

నాయకులందరూ ఒకే తాటిపైకి వచ్చి చంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యకర్తలకు టిడిపి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఓట్లు గల్లంతు, నమోదు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తకాలను అందజేస్తున్న శ్రీరాములు

ఆదర్శప్రాయుడు 'అల్లూరి'

కంచిలి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అల్లూరి సీతారామరాజు ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. మండలంలోని బూరగాంలో కామ్రేడ్ బొట్ట శ్రీరాములు అధ్యక్షతన అల్లూరి 126వ జయంతి వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ముందుగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గిరిజనుల్లో ధైర్య సాహసాలను నింపి వారిని స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వామ్యం చేశారన్నారు. అనంతరం ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధించిన బద్రి అనురాధ, జీనగ అంజలి, కప్ప త్రిషలకు గ్రామానికి చెందిన కొర్రాయి దుర్గారావు జ్ఞాపకార్థం పెద్దబాలశిక్ష పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బొడ్డు అప్పారావు, ఎం.వెంకటరావు, ఎం.సర్వేశ్వరరావు, కె.గోపీనాథ్, ఎం.తిరుపతిరావు, కె.రాజు, కె.మీనారావు, బి.జగన్ పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అదజేస్తున్న నాగరాజు

అలరించిన ఫొటో ఎక్స్‌పో

శ్రీకాకుళం అర్బన్ : ఫొటోగ్రాఫర్లకు విద్యలో మెళకువలు నేర్చుకునేందుకు ఫొటో ఎక్స్‌పో దోహదపడుతుందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాల్లో ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యాన ఫొటోగ్రాఫర్ల పండగ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఫొటో ఎక్స్పో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన కంపెనీలు ఇందులో పాల్గొని తమ ఉత్పత్తులు, ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులు, నాణ్యతా ప్రమాణాలపై పలు అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్ట నాగరాజు ఎక్స్పో ప్రాధాన్యతను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పక్కి వేణుగోపాలరావు, చౌదరి సతీష్, ప్రకాష్, న్యాయవాది దివ్వల వివేక్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కవిటి: జనసేన నాయకులు లోళ్ల రాజేష్ ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ సౌజన్యంతో మండలంలోని పెద్దకర్రివానిపాలెంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 350 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కిడ్నీ, బిపి, షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, జనసైనికులు పాల్గొన్నారు.

మందులను అందజేస్తున్న రాజేష్

రైతులకు ప్రభుత్వం అండ

పలాస : ల్యాబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నారని, అందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనం నుంచి విక్రయం వరకు లక్ష్యంగా కృషి చేస్తున్నారని చేస్తున్నారని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నాబారు, ఆర్‌కెవివై నిధులు రూ.27 లక్షలతో అక్వా టెస్టింగ్ ల్యాబ్, రూ.63 లక్షలతో టెస్టింగ్ ల్యాబ్‌లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతుకూ ఉచిత విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో రూ.10 వేలు కోట్లు విచ్చించి సాగర్ సిస్టం ద్వారా పంట భూములకు సాగునీరు అందించే ప్రక్రియ చేపట్టనున్నారని చెప్పారు. త్వరలోనే ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తిచేసి పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీరు అందిస్తామన్నారు. మదనగోపాల సాగరం ఆధునీకీకరిస్తానని అన్నారు. అనంతరం ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫిషరీస్ జెడి శ్రీనివాస్, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిషోర్, వ్యవసాయశాఖ ఎడి ఎల్.మధు. ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్. ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయి. పిఎసిఎస్ అధ్యక్షులు పైల చిట్టి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: జగనన్న ప్రభుత్వం రైతన్న రాజ్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శనివారం రైతు దినోత్సవం సందర్భంగా వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు తదితర వ్యవసాయ ఉత్పాదికాల నాణ్యత నిర్ధారణ కోసం రూ.1.26 కోట్లతో ఈ ల్యాబ్ ప్రారంభించామని అన్నారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, జెడ్‌పిటిసి వసంతరెడ్డి, సర్పంచ గొండెలి సుజాత, పిఎసిఎస్ అధ్యక్షులు చంటి, గోవింద, కవిటి రామ రాజు, వ్యవసాయశాఖ ఎడి బి.వి.తిరుమలరావు, పశు సంవర్దకశాఖ ఎడి వి.జయరాజ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' ఆర్థికసాయం

మెళియాపుట్టి : మండలంలోని చాపరకు చెందిన పోత్తంగి గణపతి ఇటీవల కేన్సర్‌తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు మృతుని కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ మేరకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే కొత్తూరు బాలయ్య పెరాలసిస్ వ్యాధితో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థియసాయం అందజేశారు. భవిష్యత్‌లో ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా నేనున్నానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, లాభాల వెంకటేష్, లాభాల కిరణ్, మజ్జి రామకృష్ణ, రత్నాల శారద, పొత్తంగి మధు పాల్గొన్నారు.

రక్తదాతలకు స్ఫూర్తి రవికుమార్

శ్రీకాకుళం అర్బన్ : ఎవరికి ఎటువంటి సమయం లోనైనా రక్తం అవసరం ఏర్పడితే తానున్నానంటూ ముందుకొచ్చి రక్తదానం చేస్తున్న రవికుమార్ రక్తదాతలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని లయన్స్‌క్లబ్ సెంట్రల్ చైర్మన్ నటుకుల మోహన్ అన్నారు. లయన్స్ క్లబ్ బ్యాంకులో రవికుమార్‌కు శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తిరీత్యా సారవకోట సచివాలయంలో వెటర్నెటీ విభాగంలో రవికుమార్ పనిచేస్తున్నారని అన్నారు. శ్రీకాకుళంలో రక్తం కొరతను దృష్టిలో పెట్టుకొని నిరంతరం అందుబాటులో ఉంటూ... ఇప్పటివరకు వేల యూనిట్లను రక్తదానం చేశారని అన్నారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కుమారి

సేంద్రీయ వ్యవసాయం ముద్దు

సోంపేట: సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల యాంకర్ కుమారి అన్నారు. మండలంలోని బేసిరామచంద్రపురంలో రైతులతో కలిసి శనివారం సామూహికంగా బీజామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల అధిక శాతం మొలకెత్తుతాయని అన్నారు. పంటకు చీడ పీడలు సోకదని అన్నారు. సర్పంచ్ రమేష్, వ్యవసాయ శాఖ సిబ్బంది గీత, ధనలక్ష్మి, నేలవేని, రైతులు నానాజీ, జగదీశ్వరరావు, మహేష్, రామారావు, మోహనరావు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమలు తెరిపించాలని వినతి

పలాస : జీడి పరిశ్రమలు బంద్ చేయడంతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, కార్మికుల కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని, తక్షణమే జీడి పరిశ్రమలను తెరిపించే విధంగా చర్యలు చేపట్టాలని క్యాష్యు లేబర్ అసోసియేషన్ అధ్యక్షులు అంబటి ఆనందరావు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గలో మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి వ్యాపారస్తులు లాభాలు లేవని సాకుతో పరిశ్రమలు నెల రోజులు బంద్ చేయడం దారుణమన్నారు. జీడి కార్మికులు ఉపాధి అవకాశాలు ఎక్కువగా కోల్పోతారని ప్రత్యేకంగా, పరోక్షంగానూ, 20 వేలు మంది ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. చొరవ

వినతిపత్రం అందజేస్తున్న ఆనందరావు

తీసుకుని పరిశ్రమలు వెంటనే తెరిపించి కూలీలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో శిష్టు గోపి, గజ్జి బాలయ్య, పల్లేటి రాజారావు, కొవిరి దేవరాజు, బమ్మిడి సుధాకర్, రాజాం రామారావు పాల్గొన్నారు.

నిధుల సక్రమ వినియోగంతోనే స్వయం సమృద్ధి

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలతో ఏర్పడిన స్వయం శక్తి సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు తమ సొంత నిధులను సభ్యుల ఆర్థిక, ఆదాయ అవసరాలకు సక్రమంగా వినియోగించుకున్నప్పుడే స్వయం సమృద్ధి సాధ్యపడుతుందని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్యలో అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన పాలకవర్గ సభ్యులు, గ్రామ సంఘాల విఒఎలతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి సంఘమూ పంచ సూత్రాలు పాటిస్తూ, ప్రతినెలా సమావేశాలు, పొదుపు, పుస్తక నిర్వహణ చేసుకోవాలని అన్నారు. సంఘ సభ్యుల పొదుపు మొత్తాల నుంచి సంఘం సభ్యుల అవసరం మేరకు, సంఘ సభ్యులందరి ఆమోదంతో అప్పు మంజూరు చేస్తూ, అవసరమైన సభ్యురాలి ఖాతాలో జమైనట్లు చేసుకోవాలన్నారు. రూపాయి వడ్డీతో వాయిదాల ప్రకారం నెలవారి వసూలు చేసుకోవాలని అన్నారు. స్త్రీనిధి రుణాలను మంజూరు చేసి జీవనోపాధులను మెరుగుపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కవిటి: మండలంలోని కుసుంపురానికి చెందిన మాతృమూర్తి యువజన సేవా సంఘం ఉద్దానం ప్రాంతంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని వక్తలు అన్నారు. సోంపేటకు చెందిన ఎన్ఆర్ఐ పండి జగదీష్, పండి అర్చన ఆర్థిక సహాయంతో మాతృమూర్తి యువజన సేవా సంఘం ఆధ్వర్యాన బొరివంకకు చెందిన కొంతరు బిసాయి, లోండపుట్టుగకు చెందిన నీల బిసాయికి అన్నపూర్ణలకు శనివారం నిత్యావసర వస్తువుల అందజేశారు. అనంతరం సీతయ్య ఫౌండేషన్‌లోని 30మంది వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చలపతి, మోహనరావు, ప్రదీప్, రవి, కవిశ్వరరావు, కూర్మారావు, నాగేష్, కేశవ పాల్గొన్నారు.

సరుకులను అందజేస్తున్న సభ్యులు

అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ఎల్ఎన్‌పేట : ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని పెద్దకొల్లివలసలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో శనివారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్లు చేసి అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్‌డ్రా చేయమని కార్డును ఇవ్వరాదని సూచించారు. ఎపిజివిబి బ్యాంకు సిబ్బంది స్వాతి, సిఎఫ్ రమ, వాలంటీరు రమ్య, హరనాథ్, రామారావు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న విజయ, రామారావు

కిరణ్ కుటుంబానికి చెక్కు అందజేత

సోంపేట : బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందిన తమ కుమారుడి అవయవాలను దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన సోంపేటకు చెందిన మల్లారెడ్డి మోహన్ కుటుంబ సభ్యులకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆర్థికసాయం అందజేశారు. మోహన్, కళ్యాణి దంపతుల కుమారుడు మల్లారెడ్డి కిరణ్ ఇటీవల ఇతరులకు అవయవాలను దానం చేసి సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్ ఆర్థికంగా చేయూత అందించారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన రూ.5 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి ఎం.దాసు, జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ ప్రభావతి పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు పెద్దపేట అనుకూలం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేట విత్తన అభివృద్ధి క్షేత్రంలో వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి నాయకులు పీరుకట్ల విశ్వప్రసాద్ అన్నారు. మండలంలోని టి.కె.రాజపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీగా తాను ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి 120 ఎకరాలు విస్తీర్ణం ఉన్న అభివృద్ధి క్షేత్రంలో వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించానని అన్నారు. అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తే బూర్జ, ఆముదాలవలస, విజయనగరం జిల్లా రేగిడి, సంతకవిటి, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, సీతంపేట, భామిని మండలాల విద్యార్థులకు అనువుగా ఉంటుందని అన్నారు. వైసిపి ప్రభుత్వ తరువాత శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తొగరాం ఏర్పాటు చేశారని అన్నారు.

బహుమతులతో విద్యార్థులు

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

ప్రస్తుత విద్యావిధానంలో విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని లోలుగు ఉపాహార్ స్వచ్ఛంద సంస్థ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్ అన్నారు. లోలుగు ఉపహార్ ప్రాజెక్టు ఆధ్వర్యాన కల్లట, మర్రివలస, విశాఖపట్నం, లోలుగు ఉపహార్ కేంద్రాలలోని విద్యార్థులకు శనివారం పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలో పోటీతత్వం పెరిగినప్పుడే ఉన్నతంగా రాణించగలరని అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, పాటల పోటీలను నిర్వహించారు. విద్య, తల్లిదండ్రుల విలువలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు పాల్గొన్నారు.

రవికుమార్ పరామర్శ

బూర్జ : మండలంలో తొడ్డల పంచాయతీ హరిపురంపల్లాపురంలో ఇటీవల అనారోగ్యంతో ఎస్.రాజారావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజారావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇరవై ఏళ్లుగా టిడిపి రాజారావే అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు వి.రాంజీనాయుడు, సర్పంచ్ అంపిలి గణపతి, మాజీ సర్పంచ్ జడ్డు కృష్ణ, పోలయ్య ఉన్నారు.